# దిగ్భ్రమ

ఫుల్ హాండ్స్ పోలిస్టర్ షర్టు సరిచేసుకుని ఆఖరిసారిగా మరోసారి అద్దం ముందు నిలబడి తన అందం చూసుకుని సంతృప్తిగా ఇవతలకు వచ్చాడు మురళీకృష్ణ.

అతని వాలకం, అతని ధోరణి ఓ గంట నించీ గమనిస్తూనే వున్న శచీదేవి మెల్లగా ఇవతలకు వచ్చింది.

"చూడు డియర్! నేను సేతుపతి గారింట్లో భోజనానికి వెడుతున్నాను. బహుశ గట్టిగా బలవంతం చేసి అక్కడే వుంచితే రాత్రికి రాకపోవచ్చు. తలుపులు జాగ్రత్తగా గడియ వేసుకుని పడుకో. తెల్లవారేసరికి ఇక్కడే వుంటాను నీ కళ్ళముందు తిరుగుతూ" అన్నాడు మురళీకృష్ణ.

అలాగేనన్నట్లు తల పంకించి వూరుకుంది శచీదేవి. టాటా చెబుతూ వెళ్ళిపోయాడు రిక్షాలో. ఆ రిక్షా కనుమరుగయ్యే వరకూ చూస్తూనే వుంది. ఆ సందు మలుపు తిరిగాక భారంగా నిట్టూర్చుతూ తలుపు గడియ వేసుకుని లోపలకు వచ్చేసింది.

ఆనాలుగు గదుల ఇల్లూ నాలుగు వందల గదులై దుర్భరమైన ఏకాంతవాసంలో అతి భయంకరంగా కనిపించాయి.

ఒంటరితనం మనిషికి ఏకాస్తసేపో ప్రశాంతంగా వున్నట్టు తోచినా అదే అనునిత్యం భరించాల్సి వస్తేమటుకు పెద్ద శాపంలా అనిపిస్తుంది. మాట్లాడేందుకు మనిషిలేక కష్టసుఖాలు కలబోసుకునే వ్యక్తి కరువయితే ఆ జీవికి అంతకంటే మరో శిక్ష అవసరంలేదు.



అందుకే ఆ నాలుగు గదుల ఇంట్లో తను ఒకప్పుడు వైభవోపేతంగా జీవితం గడిపినా పరిస్థితులు తల్లక్రిందులై జీవిత గమనంలో విషాద జీమూతాలు ఆవరించుకున్న తరుణంలో ఒక చిత్రకారుడిగా, కవిగా, గాయకుడిగా ఆ యింట్లో రెండుగదుల్లో అడుగు పెట్టిన మురళీకృష్ణను ఎంతో అభిమానంగా చూస్తుంది శచీదేవి-

అయితే మురళీకృష్ణ ఆమె అనుకున్నంత ఉన్నతుడుకాదు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే పరిస్థితులను సాధ్యమైనంతవరకు తనకు అనుకూలంగా మార్చుకుంటూ 'తన ' అనే రెండక్షరాల బాగునే దృష్టిలో పెట్టుకునే వ్యక్తి.

అతని గది అంతా ఒకసారి పరిశీలించింది. రంగులు, స్కెచ్ పెన్సిళ్ళు, డ్రాయింగ్ పేపర్లు అంతా ఆ గదిలో చిందర వందరగా పడేసుకున్నాడు.

బయటకి పోతున్నాడు కనుక అందునా వెళ్ళేది గొప్ప వారింట్లో భోజనానికి గనుక గడ్డం నున్నగా గీసినట్లున్నాడు రేజరు-క్రీమ్-వగైరాలన్నీ అక్కడే ఒక ప్రక్కన పడివున్నాయి. చిన్న స్టీలు గిన్నెలో సబ్బు నీళ్ళు.

ఆ గదులు శచీదేవి వూడవవలసిందే తప్ప అతను మాత్రం శుభ్రంచేసుకోడు. ఏదన్నా టిఫిన్ చేస్తే ఆ ఆకులు కూడా ఓ పక్కనే పడేసి వుంటాయి. అదేమిటి? అని అడిగితే "తీరుబడి లేదు" అనిగాని, మూడ్ పోతుందనిగాని జవాబిస్తాడు. బద్ధకస్తుల సంఘానికి అతడే ప్రెసిడెంటు. అవన్నీ బాగుచేసి నీటుగా సర్ది తన గదిలోకి వెళ్ళింది. ఉదయం అన్నం వుంది. పనిమనిషి ఎలాగో రాలేదు. ఆ అన్నం తిని పడుకుంటే సరి" అనుకుంటూ మంచంమీద ఒరిగింది శచీదేవి.

శచీదేవి భర్త శివరావు హఠాత్తుగా నాలుగేళ్ళ క్రిందట పోయాడు. ఆ యిల్లు ఖాళీచేసి ఆ జ్ఞాపకాలనుంచి తప్పుకుందామనుకుంది కాని ముందు రెండు గదుల్లోకి అద్దెకిమ్మంటూ మురళీకృష్ణ ప్రాధేయపడి అద్దెకు వచ్చాడు.

అతనికి అందగాడు అనిపించే పర్సనాల్టీ వుంది. మాటల్లో చమత్కారం వుంది. కవి, గాయకుడు కనక ఎదుటి వారి గుండెలను తాకగల శక్తి వుంది. అందుకే పిల్లా జెల్లా లేని ఒంటరి శచీదేవిని అతడు చాలా త్వరగా ఆకర్షించగలిగాడు.

అతని బద్ధకాన్ని ఏపనీ చేసుకోలేని అసమర్థతను గ్రహించి తనే వండటం పెట్టడం అన్నీ చేస్తుండేది.

శచీదేవి అందం, ఆకర్షణ మురళీకృష్ణను విపరీతంగా ఆకర్షించాయి. ఆమె మీద అపారమైన అనురాగ వర్షాన్ని కురిపించాడు. అక్కడ చేరిన ఆరు నెలలకి "శచీ! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. జీవితాంతం నువ్వు నా దగ్గర వుండవలసిందే" అంటూ ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. అతని కౌగిలిలో కరిగిపోయింది శచీదేవి. ఆనాటి నుంచి ఈనాటి వరకు అతని బిగి కౌగిలిలో నలిగిపోతూనే వుంది.

అతన్ని వదిలి వుండలేని స్థితిలో పడిపోయింది. అతను రావడం ఆలస్యం అయితే ఆమె ప్రాణం విలవిలలాడిపోతుంది. అతను కనిపించకపోతే ఆమె పిచ్చెక్కినట్టు వుంటుంది. అనుక్షణం తన కళ్ళ ఎదురుగా అతను వుండాలని ఆమె కాంక్ష-

మురళీకృష్ణ వెళ్ళేసరికి హాలులో సగంమంది ఆహూతు లున్నారు.

"రండి రండి" అంటూ ఆహ్వానించింది సేతుపతి భార్య శ్యామల. "తననా! లేక మరెవరి నన్నానా" అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు మురళీకృష్ణ.

అతని వెనక పెద్ద అంచు నీలం చీర అదే రంగు జాకెట్‌లో మెడలో నాలుగయిదు రకాల బంగారు నగలతో ఎడమ చేతికి గోల్డు రిస్టు వాచి, కుడిచేతికి రవ్వల గాజులు ఆ ఖరీదైన నగల మధ్య, కంచిపట్టు చీరలో కనిపించిన ముప్పయి ఏళ్ళు నిండిన పడతి దర్శన మిచ్చింది.

జొన్నలగడ్డ లలితాదేవి

ఆవిడ ఆహ్వానం బహుశ ఆమెకే అయివుంటుందను కున్నాడు.


సేతుపతి వచ్చి నవ్వుతూ షేక్‌హ్యాండ్ ఇచ్చి మురళీ కృష్ణని తీసుకు వెళ్ళి కుర్చీ చూపించాడు కూర్చోమని.

"ఈమె రాజారావు భార్య అరుణ" అంటూ పరిచయం చేసింది శ్యామల.

అంటే రాజారావుని గురించి అతని భార్యని గురించి అంతకు ముందే విని వుండాలి మురళీకృష్ణ అనుకున్నాడు సేతుపతి భార్య మాట వింటూ.

"ఇతనేనే ఆర్టిస్టు మురళీకృష్ణ" అంటూ అరుణతో చెప్పింది శ్యామల.

"అబ్బ! ఎంత బాగున్నాడు! ఆ చక్కని వేళ్ళే చాలు చూస్తుంటే ముద్దు వస్తున్నాయి" అనుకుంది అరుణ. అంత వరకూ అతన్ని గురించి విని వున్నది కనుక మురళీకృష్ణకు ఆ



క్షణంలో అరుణ రంభలానే కనిపించింది.

"మీ గురించి వినడమేగాని ఇంతవరకూ ప్రత్యక్షంగా చూడటం పడలేదు. శ్యామలగారు మా అరుణ కుందనపు బొమ్మ. వెన్నెల తునక అంటూ మిమ్మల్ని వర్ణిస్తుంటే ఏమిటో అనుకున్నాను. ఇప్పుడనిపిస్తోంది ఆ మాటలో అసత్యం ఏమీ లేదని" అంటూ మధురంగా నవ్వుతుంటే బుగ్గల్లో మందారాలు, గుండెలో వేయి గులాబులు విరిసాయి అరుణకు.

ఆ తర్వాత పార్టీ అంతా వాళ్ళిద్దరే అన్నట్టు తిరిగారు. కబుర్లు చెప్పుకున్నారు, జోక్స్ వేసుకున్నారు, నవ్వుల పువ్వులు రువ్వుకున్నారు.

భోజనాలయ్యాక అందరూ సావకాశంగా తాంబూలాలు వేసుకుంటూ మురళీకృష్ణను పాటలు పాడమంటూ గొడవ చేశారు.

అతను అరుణనే చూస్తూ నాలుగు ప్రేమ గీతాలు ఆలపించాడు. అది గమనించి అరుణ ఆనందంతో పులకించి పోయింది.

"రేపు నా రూమ్‌కి రండి. మీ బొమ్మ వేస్తాను" అంటూ అడ్రసు ఇచ్చాడు మురళీకృష్ణ వెళ్ళబోయే ముందు.

అలాగేనంటూ సంతోషంగా చెప్పింది అరుణ అది అందుకుని.

"ఏమే! మీ ఆయన రాలేదుగా! ఎలా వెడతావు ఈపూటకి ఇక్కడ పడుకోరాదూ" అంది శ్యామల.


ఆయనకంత సరసం కూడానా అనుకుంది మనసులో విసుగ్గా అరుణ.

"ఫర్వాలేదు, రిక్షాలో వెళ్ళిపోతానులే" అంది పైకి.

"రండి ఆటోలో దింపుతాను" అన్నాడు మురళీకృష్ణ ఆ సంభాషణ వింటూ.

"ఇకనేం నిక్షేపంగా వెళ్ళు" అంది శ్యామల ప్రోత్సహిస్తూ.

అరుణ చెప్పులు వేసుకుని బయలుదేరింది. అడ్రసు



చెప్పింది తనది.

ఆటో మాట్లాడాడు మురళీకృష్ణ. ఇద్దరూ అందులో కూర్చున్నారు బాగా దగ్గరా ఒకరినొకరు తగులుతూ.

అతని చెయ్యి మెల్లగా ఆమె భుజం మీద పడింది. ఆ చెయ్యి మీద చెయ్యి వేసింది. అరుణ తన మృదువైన వేళ్ళతో నొక్కింది.

అతి సున్నితంగా ఆమె బుగ్గలమీద ముద్దుపెట్టుకున్నాడు మురళీకృష్ణ.

అబ్బ! ప్రేమ! ఎంత సున్నితంగా...ఎంత ఆహ్లాదంగా వుంటుంది అనుకుంది అరుణ మురిసిపోతూ.

ఆటోలో అతని చెయ్యి ఆమె శరీరం మీద అనేక చోట్ల తడిమింది. సుతారంగా వీణ మీటినట్లు మీటింది. అరుణలో ఆవేశం వచ్చినా తమాయించుకుంది.

ఇల్లు చేరాక క్రిందకి దిగింది అరుణ.

"రేపు తప్పకుండా రూముకు వస్తారుగా-మీకోసం ఎదురు చూస్తుంటాను" అన్నాడు మురళీకృష్ణ.

"వస్తాను" అంటూ బ్యాగులోంచి 20 రూ. నోటు తీసి అతనికిచ్చి "మీరు మా ఇంటి దగ్గర దిగి అతనికి ఇచ్చేయండి" అంది. మెట్లు ఎక్కుతూ టాటా చెప్పింది. అదే ఆటోలో ఇంటికి వచ్చి డబ్బులిచ్చేసి తలుపు తట్టాడు. అతను ఎప్పుడు వస్తాడా అని వేయి కళ్ళతో చూస్తున్న శచి హృదయం అతన్ని చూడగానే పురి విప్పిన మయూరిలా నర్తించింది.

"పార్టీ బాగా జరిగిందా?" అని అడిగింది పక్క దులిపి వేస్తూ.

"ఆ!" అంటూ మంచంమీద వాలిపోయాడు.

అరుణ పైకివచ్చే సరికి భర్త గాఢంగా నిద్రపోతూ కనిపించాడు. అతన్ని చూసి ముఖం తిప్పుకుంది.

ఛీ...ఏం మొగుడు...ఓ లాలించడం లేదు, ప్రేమించడం రాదు, ఏదీ రాదు. పెద్ద కంపెనీలో మేనేజరు. ఆఫీసు కారు, హోదా అన్నీ ఏడిశాయి. కాని ఏం లాభం...అసలు పనికోసమే పుట్టినట్టు ప్రవర్తిస్తుంటాడు. ఆఫీసులో పని. అది చాలనట్టు ఇంటికొచ్చాకా చిన్న బ్రీఫ్‌కేస్‌లో కాగితాలు మోసుకొచ్చుకుంటాడు. అని రాత్రి పదింటిదాకా చూస్తుంటాడు. ఆపైన హాయిగా నిద్రపోతాడు. ఆ నిద్రలో గురక ఒకటి తన ప్రాణానికి. తనకి అలా గురక పెట్టే వాళ్ళంటే చాలామంట. తన ఖర్మకాలి అలాంటి మొగుడే దాపురించాడు.

ఈ గురక పడలేక మంచాలు వేరుచేసి పారేసింది-"అదేం అరుణా! డబుల్ కాట్ మంచాలు తీసిపారేసి సింగిల్ కాట్ తెచ్చావు?" అని అడిగాడు రాజారావు. ఆ! సింగిల్ కాట్ అయితేనేం? రావాలనుకుంటే మంచంమీదకి ఎంతసేపు రావాలేమిటి?" అని అడిగింది.

పాపం రాజారావు నిజమేనని ఒప్పుకుని వూరుకున్నాడు.

కసిగా పెదవి కొరుక్కుంటూ మంచంమీద వాలింది.

శ్యామల అన్నట్టు నిజంగానే మురళీకృష్ణ అందగాడు, ప్రేమమూర్తి, చిత్రకారుడు, గాయకుడు, కవి. అలాంటి వ్యక్తి తనకి పరిచయం కావడం తన అదృష్టం అనుకుంది అతన్ని తలుచుకుంటూ దిండుని కావలించుకొని.

తెల్లవారి అతని రూమ్‌కు వచ్చే సరికి ఆమె కోసమే అతను వీధిలో బిచాణా వేశాడు. ఆమె రాగానే తలుపులు ఓరగా వేసి కౌగిలిలోకి తీసుకున్నాడు. వళ్ళంతా ముద్దుల తో ముంచివేశాడు. ఆ కౌగిలిలో వెన్నలా కరిగిపోయింది అరుణ.

కాఫీ కలుపుకుని వచ్చిన శచి ఆ దృశ్యం చూసి స్తంభించిపోయింది. తన దేవుడు! తన ఆరాధనామూర్తి! తను మనసారా వలచిన మురళీకృష్ణ-అరుణతో రాసక్రీడలు. గభాలున ఇవతలకి వచ్చేసింది. కళ్ళంబడి గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఓసి పిచ్చిదానా! నీకు ఆనందం అనుభవించే గీత వుంటే నేనే బతికి వుండేవాడిని" అంటూ వెక్కిరించినట్లని పించింది శివరావు ఫోటో.

"ఇక్కడ ఈ లైఫ్ నాకు బోర్‌గా వుంది. ఏదైనా వూరు వెడదామా?" అని అడిగింది అరుణ జాకెట్ హుక్స్ పెట్టుకుంటూ.

"ఓ.యస్. తప్పకుండా వెడదాం. నాకూ ఈవిడతో బోరుకొడుతోంది" అన్నాడు మురళి.

"ఆవిడని మీరు పెళ్ళి చేసుకున్నారా?" అని అడిగింది అరుణ కుతూహలంగా.

"సరేలే" నిడోను కట్టుకుని మళ్ళీ నేను అర్థాయుష్షు వాడినై నాలుగేళ్ళకే హరీ అవమంటావా?" అతను హాస్యానికే అన్నా శచీదేవి మటుకు స్పష్టంగా ఈ ఆఖరు మాట విన్నది. ఆమె గుండెల్లో మంటలు రాజుకున్నాయి.

వంటగదిలోనే నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది బయటకు రాకుండా.

మర్నో నాలుగు రోజులకు బీరువాలో డబ్బు, నగలు తీసుకుని మురళీకృష్ణతో హైదరాబాద్ బయలుదేరింది అరుణ. రాజారావుకి మాట మాత్రం చెప్పకుండానే అలాగే శచీదేవికి చెప్పకుండానే మురళీకృష్ణకూడా బయలుదేరాడు.

ఇద్దరూ హాయిగా సంతోషంగా సరదాగా హైదరాబాద్ చేరి హోటల్లో రూం బుక్‌చేసి జాలీగా గడిపి వారం రోజుల్లో తిరుగు ప్రయాణం అయ్యారు.

కారు సూర్యాపేట దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీకి గుద్దుకుంది. ఇద్దరికీ బలమైన గాయాలు తగిలాయి. హాస్పిటల్‌లో చేర్చబడ్డారు. ఫోన్ గణగణా మ్రోగుతుంటే అందుకున్నాడు రాజారావు.

"మీ ఆవిడకు యాక్సిడెంట్ అయిందిసార్. ఆస్పత్రిలో వున్నారు." ఆ మాటలకు కంగారు పడ్డాడు రాజారావు.

"జాగ్రత్తగా చూస్తుండండి ఎంత డబ్బయినా సరే వెనుకాడను. నేనిప్పుడే బయలుదేరి వస్తాను" అంటూ అడ్రసు మరోసారి అడిగి నోట్ చేసుకున్నాడు రాజారావు.

తలుపు టకటకా తడుతుంటే అదిరిపాటుతో తలుపు తీసింది శచీదేవి.

"మీ మురళీకృష్ణ యాక్సిడెంట్ అయి ఆస్పత్రిలో వున్నారు" అంటూ న్యూసు అందించాడు పోలీసు.

ఆ మాటకు పిడుగు పడినట్లు అదిరిపడింది శచి. కళ్ళంబడి నీళ్ళు గిర్రున తిరిగాయి.

రాజారావు, శచీదేవి ఇద్దరూ కాస్త ఇంచుమించుగా వచ్చారు ఆస్పత్రికి. అక్కడ మురళీకృష్ణ తన భార్య కలిసి వారం రోజులుగా హైదరాబాద్‌లో మకాంవేసి తిరుగు ప్రయాణంలో ఆపద పాలైనట్లు తెలిసి నిర్విణ్ణుడయ్యాడు రాజారావు.

తన భార్య మురళీకృష్ణతో లేచిపోయింది. ఆ మాట తట్టగానే వళ్ళంతా కుతకుతా వుడికిపోయింది అతనికి.

ఛీ...ఎంత బాగా చూసుకున్నా వెధవ బుద్ధి వెధవ బుద్దే! అనుకున్నాడు కసిగా-

"నువ్విలాంటి ద్రోహం తలపెడతావు నాకు అని అనుకోలేదు. నీకు నయం అయ్యాక నీకు డైవర్స్ ఇస్తాను. నీకు నాకు ఏం సంబంధం లేదు. ఆ మేడ కూడా అమ్మేసి నేను వేరే పోతాను. నీ నగలు, నీ చీరలు నువ్వే పట్టుకు పో" అంటూ పెద్ద పెద్ద కేకలు వేశాడు.

అది విన్న అరుణ భయంతో బిగుసుకు పోయింది. శచీదేవి గజగజా వణికింది. అతను గదిలోంచి ఇవతలకు వస్తుంటే చటుక్కున అడ్డం వెళ్ళి నుంచుంది శచి.

"ప్లీజ్! జరిగిపోయిందేదో జరిగిపోయింది. కోర్టులు-కేసులు అంటూ గొడవ చేయకండి. ఇది ఆమె మొదటి తప్పుగా మన్నించి ఆమెను మామూలుగా వుండనీయండి" అంది దీనంగా చూస్తూ.

## అక్షరాలు శపిస్తాయ్!

వెన్నెల్లో తడిసిన
సన్నజాజులు,
మల్లె మొగ్గలు,
అశుభమూ, శుభమూ తెలియని
పసిపాపలు అక్షరాలు.
తపస్సులో వున్న ఋషులు,
సీసాల్లో బందీ అయిన పరిమళాలు
మౌనముద్ర ధరించిన అక్షరాలు
శిల్పి చేతిలో అందమైన ఆకృతి ధరించే
శిలలు,
కవి కలంలో రమణీయత పొందే భావాలు,
చిత్రకారుని కుంచెలో
విచ్చుకోనున్న ప్రకృతిలో సొగసులు,
గాయని గళంలో రెక్కలు విప్పుకునే పాటలు
కదలక మెదలక ఉన్న అక్షరాలు
పదాలుగా మారి
కదం తొక్కుతాయి!
తమస్సును తొలగించి
చైతన్య దీప్తిని వెలిగిస్తాయ్!
అగ్ని పర్వతాలుగా బద్దలయ్యి
విస్ఫులింగాలను విరజిమ్ముతాయ్!
తాడిత, పీడిత ప్రజానీకానికి
బాసటగా నిలిచి
భుజం తట్టి ముందుకు నడిపిస్తాయ్!
లలిత లలితంగా
మధురభరితంగా మురిపిస్తాయ్!
ప్రజ్వరిల్లితే
అక్షరాలు శపిస్తాయ్!

— కొడిమెల శ్రీరామమూర్తి

"మీ రెవరు?"

"నేను మురళీకృష్ణను వలచిన పిచ్చిదాన్ని"

ఒకసారి ఆమెకేసి చూసి "సరే! కేసు వద్దులే. కాని మేమే లిఖిత పూర్వకంగా పరిష్కరించుకుంటాము" అంటూ అవతలకి వెళ్ళిపోయాడు రాజారావు.

చిన్న చీటీ పంపింది మురళీకృష్ణకు అరుణ.

"ఆయనగారు వచ్చి నామీద ఎగురుతున్నాడు. ఏం చేద్దాం? మనం వేరే వెళ్ళి వుందామా?" అంటూ.

"నాకు వచ్చే ఆదాయం ఇది. నువ్వు సంతృప్తి పడగల నంటే నాదగ్గరే వుండు. కాని నువ్వింతవరకూ దరిద్రం అనేది ఎరగని దానివి. నా దగ్గర సామాన్య జీవితం వెళ్ళబుచ్చాల్సిందే అందుకు సిద్ధపడగలవా?' అని రాసి పంపాడు. అది చదివాక ఒకసారి తన మేడ, కారు, ఫర్నిచరు అన్నీ కళ్ళముందు తిరిగాయి అరుణకు. నిజంగా చెప్పవలసి వస్తే తన భర్తలో ఏలోపం లేదు. తనకి ఏ లోటూ లేకుండానే చూస్తున్నాడు. అయినా తనే ఒంటి పొగరుతో మురళీకృష్ణతో లేచిపోయింది. ఇప్పుడీ నిత్యదరిద్రుడు తననేం భరించగలడు? చూడగా చూడగా తను చేసింది చాలా ఘోరమైన తప్పిదంగా తోచి కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి అరుణకు. తన భర్త క్షమించి తనను ఇంటికి రానిస్తే చాలుననుకోసాగింది.

ఆస్పత్రినించి డిశ్చార్జ్ రోజున మళ్ళీ వచ్చాడు రాజారావు.

"ఇదుగో నీమీద కేసు వద్దని పాపం ఆ అమ్మాయి ప్రాధేయపడితే జాలిపడి వదిలేస్తున్నాను. నీకు నాకు జన్మలో ఏ సంబంధం లేదు. వెళ్ళి వాడిదగ్గరే వుండవచ్చు" అంటూ డబ్బు ముఖాన కొట్టాడు రాజారావు.

"ఏ అమ్మాయి?"


"అదే ఆ శచీదేవి!"

"ఓహో! ఆవిడ చెప్పడం, మీరు నానడం! ఏం వేషాలు! దాన్ని మీరు తగులుకున్నారేమిటి? దాని గీచిన గీటు దాటనట్టు మాట్లాడుతున్నారు" బుసలు కొట్టింది అరుణ.

"షటప్! అంతా నీలాంటి వాళ్ళేననుకోకు. ఎవర్ని ఎలా గౌరవించాలో నేర్చుకో" అంటూ గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు రాజారావు.

"నీ ప్రియురాలిని ఇప్పుడు నా ఆయన వుంచుకున్నాడు" అంటూ అరుణ చెప్పిన వార్తకు తెల్లబోయాడు మురళీకృష్ణ.

సరిగ్గా మరో గంటకు ఆస్పత్రినించి విడుదలయింది అరుణ. బస్‌లో విజయవాడ వెళ్ళాలి. ఖర్మ! కారు లేదుగా అనుకుంది విరాగ్గా.



"ఆయనగారు దాన్ని ఎక్కించుకుని వూరేగినట్టున్నాడు" అనుకుంది కసిగా- సరిగ్గా అలాగే జరిగింది కూడా-

"మాట్లాడదాం రమ్మన్నారు దేనికి?" అని అడిగింది శచి బెరుగ్గా అతన్ని చూస్తూ— ఇంటికి వచ్చాక. నౌకరు తెచ్చిన కాఫీలు ఎదురుగా పొగలు గ్రక్కుతున్నాయి.

"నేను అరుణతో తెగతెంపులు చేసుకున్నాను" అన్నాడు కాఫీ సిప్‌చేస్తూ ఒకటి ఆమె కందించి.

"పాపం. వద్దండి...ఇంతకాలం మీ నీడన సుఖంగా బతికింది...అతనికి ఆర్జన సరిగా లేదు. ఈపాటికే ఆమె తను తన తప్పు గ్రహించి వుంటుంది. పశ్చాత్తాపపడుతూ వుంటుంది. ఈ సమయంలో మీరు కాదంటే ఆమె ఏమయిపోతుంది. తప్పులన్నాక మానవులు కాకపోతే మాకులు చేస్తాయా?"

"బాగానే వుంది. నీకేసు అటువంటిదేగా! ఇప్పుడు నీ మనోనాథుడు వచ్చి నిలబడితే క్షమించేసి కాళ్ళకి చుట్టుకుంటావా?"

ఆ మాటకు విషాదంగా నవ్వింది శచి-

"నేను నిడోని. నా ప్రేమలో అతన్ని బంధించి అతనికి అర్ధాయుష్షునివ్వలేను. అతను సుఖంగా వుండటంమంచిది. నేనిక అతని జీవితంలోకి అడుగు పెట్టను." ఎంత అణచుకున్నా ఆమె మాటల్లో పౌరుషం ధ్వనిస్తూనే వుంది.

"ఈ మాట అతనుగాని అన్నాడేమిటి?" చప్పున అడిగాడు రాజారావు.

"అవును."

"చూడు శచీదేవి! ఒక్కమాట అతను అన్నాడని నువ్వు పౌరుషపడి అతన్నించి తప్పుకోవాలనుకుంటున్నావు. ఆడదానివైనా అవునా?"

"మరి నేను దాన్ని పసిపాపలా చూసుకున్నానా-కాలుకింద పెట్టనివ్వకుండా, ఏలోటూ లేకుండా చూసుకున్నాను. అయినా గుడిసెమీద దెబ్బకొట్టి వాడితో పోయింది. అలాంటిదాన్ని తెచ్చుకుని ఏలుకోవడానికి నాకెంత పౌరుషం వుండాలి?" అని అడిగాడు రాజారావు.

ఆ మాటకు జవాబివ్వలేకపోయింది శచీదేవి.

"పోనీ వాళ్ళిద్దర్నీ ఒకటి చేసి మనిద్దరం ఒకటి అవుదాం ఒప్పుకుంటావా?"

రాజారావు మాటకి తెల్లబోయింది. అలాగే వెర్రి చూపు చూసింది తల అడ్డంగా తిప్పుతూ. అది గమనించి—

"అయితే క్షమయా ధరిత్రి అంటారుగా మీ ఆడాళ్ళని. నువ్వు అతన్ని క్షమించి తిరిగి నీవాడిని చేసుకో."

దూరంగా రిక్షాలో వస్తున్న అరుణని సులభంగానే గుర్తుపట్టింది శచి. ఆమె ఎందుకు వస్తోందో కూడా అర్థమయింది. అయితే రాజారావు చూడలేదు అరుణని .

"అలాగే నేను అతన్ని క్షమిస్తాను. మీరు అరుణని క్షమించండి" అంది గబగబా.

"సరే- ముందు కాఫీ త్రాగు."

శచి కాఫీ తాగుతుంటే ఛర్రున వచ్చేసింది అరుణ.

"ఓహో! పెళ్ళాం తప్పు చేసిందని ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. ఇప్పుడు మీరు చేస్తున్న పనేమిటి? దాన్ని తెచ్చుకుని కులుకుతున్నారా? నీతి అన్నాక ఇద్దరికీ ఒకటేగా? నాది తప్పు, మీది రైటునా?"

"ఇదుగో శచమ్మా! ఇది నాయిల్లు. నీ మొగుడు అక్కడ కొంపకి చేరాడు. పోయి సేవలు చేసుకో. ఇక్కడ ఒక్క క్షణం నువ్వు వున్నా సహించను" అంటూ రంకెలు వేస్తున్న అరుణని చూసి ఏవగించుకున్నాడు రాజారావు. అప్పుడే మనసులో గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఆ రాత్రే తను బయలుదేరి మద్రాసు వెళ్ళాలని. శచీదేవి కాఫీ అలాగే సగంలో వదిలేసి "వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళేసరికి అరుగుమీద చతికిలపడి వున్నాడు మురళీకృష్ణ. గబగబ తాళం తీసింది.

"ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగాడు మురళీకృష్ణ.

"రాజారావు గారితో మాట్లాడి వస్తున్నాను."

"వాడితో నీకు మాటలేమిటి? ఓహో! అరుణ చెప్పిందిలే. వాడిని నువ్వు తగులుకున్నావని" కసిగా అన్నాడు మురళీకృష్ణ.

ఆ మాటకి భగ్గున మండినా తమాయించుకుని—

"అరుణని, అరుణ మాటల్ని ఇకనైనా మీరు మరచిపోవడం మంచిది. అయిందేదో అయిపోయింది. ఆమె తన పొరపాటు గ్రహించి తన భర్త దగ్గరకు వెళ్ళింది. ఇకనైనా వాళ్ళని సుఖంగా బ్రతకనీయండి- సంసార స్త్రీలజోలికి, సంసార స్త్రీలను పార్టీల పేరుతో తార్చుడుకు మార్చే శ్యామలలాంటి వాళ్ళిచ్చే విందులకు హాజరయి వాళ్ళ బ్రతుకులు నాశనం చేయకండి" అంటూ గిరుక్కున లోపలికి వెళ్ళిపోయింది శచీదేవి.



దీపికా దరహాసం   ఫొటో: చైతన్యమునిషి: విజయవాడ